క్లుప్తంగా

నల్ల గంగమ్మకు విశేష పూజలు



సంబేపల్లి : మండల కేంద్రంలో వెలసిన దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గాలివీడు : మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి గేటు వద్ద ఆదివారం బాలీవుడ్ నటుడు సోనూసూద్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ స్టోర్ బాబ్జి, అంబులెన్స్ డ్రైవర్ రామాంజులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ రెడ్డి సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువకులు ప్రాణాలు నిలిపే రక్తదాతలుగా నిలవడం అభినందనీయమన్నారు. మానవత దృక్పథంతో చేసే ఎలాంటి సేవా కార్యక్రమాలకైన తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో మెడికల్ స్టోర్ అమీన్, పలువురు యువకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాచుపల్లె గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగప్రసాద్

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల బారినపడకుండా జాగ్రతగా ఉండాలన్నారు. లోన్‌యాప్‌ల ఉచ్చులో పడవద్దని సూచించారు. అంతేగాకుండా అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి మంచి జీవన విధానాన్ని అవలంభించాలన్నారు. గ్రామంలో ఎవరైనా శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగిస్తే సమాచారిన్ని పోలీసులకు అందించాలని ఎస్‌ఐ సూచించారు. గ్రామ ప్రజలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి

గాలివీడు : మండల పరిధిలోని అరవీడు ఎస్సీ కాలనీ, మంగళకాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లను రూ.10 లక్షల వ్యయంతో మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వగ్రామంలో ఘనంగా ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి స్వగ్రామంలో ఎల్లమ్మ జాతరను ఆదివారం అత్యంత వేడుకగా నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారికి పెద్దఎత్తున పొంగబాళ్ల పెట్టారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా వస్తున్న జాతర ఆచార వ్యవహారాలను జరిపారు. జాతరలో పాల్గొన్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఎంపీపీ వెంట వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు ఒర్సు శ్రీను, దేవిశెట్టి నడిపయ్య, గుగ్గిళ్ల ప్రసాద్, ఒర్సు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సిద్ధమవుతున్న గణనాథులు

- అడ్వాన్స్‌లు ఇచ్చి బుక్ చేసుకుంటున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు
- తుది మెరుగులుదిద్దే పనుల్లో కార్మికులు



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం



ఉత్సవాలకు ముస్తాబైన గణేష్ ప్రతిమలు

రాజంపేట టౌన్ : పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా ఘనంగా జరుపుకునే వేడుక వినాయక చవితి. ఒకప్పుడు పెద్ద నగరాల్లో ఘనంగా జరుపుకునే చవితి వేడుకలను ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో జరుపుకుంటున్నారు. ఈ కారణంగా నిర్వాహకులు దాదాపు రెండు నెలల నుంచే చవితి ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించి చర్చిస్తారు. కాగా వినాయక చవితికి సుమారు 45 రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఉత్సవ కమిటీ ప్రతినిధులు చవితి ఏర్పాట్లపై సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఏటా విగ్రహాలను ఏర్పాటు చేసే సంఖ్య కూడా పెరిగిపోతుండటంతో కళాకారులు వినాయక విగ్రహాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. చవితి వేడుకలకు సమయం సమీపిస్తుండటంతో కళాకారులు విగ్రహాలను ఆకర్షణీయంగా తయారు చేయడంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విగ్రహాలు పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి.

ఆకర్షణీయమైన రంగులపై ఆసక్తి

ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొల్పే విగ్రహాలు ఆకర్షణీయంగా ఉండేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. ప్రస్తుతం కొంత మంది ఉత్సవ కమిటీల వారు విగ్రహానికి ఎలాంటి రంగులు వేస్తే ఆకర్షణీయంగా ఉంటాయో తెలుసుకునేందుకు తొలుత కంప్యూటర్‌లో గ్రాఫిక్స్ ద్వారా విగ్రహాన్ని రూపొందించి రంగులు వేసి చూసుకొని ఆ తరువాత కళాకారులచే రంగులు వేయిస్తున్నారు. ఇందుకు మామూలు విగ్రహం కొనుగోలు చేసే ఖర్చు కంటే ఎక్కువ అవుతుంది. అయినప్పటికీ ఉత్సవ కమిటీలు భక్తులను ఆకర్షించే విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఖర్చుకు వెనుకాడటం లేదు.

విగ్రహాల తయారీతో ఉపాధి

వినాయక చవితి వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుంది. ప్రధానంగా విగ్రహాలను తయారు చేసే వారికి కొంత మందికి లక్షల్లో ఆదాయం ఉంటుంది. వినాయక చవితి సందర్భంగా అనేక ప్రాంతాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందువల్ల సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చే కళాకారులు, గాయకులు, డ్రమ్స్, డెకరేషన్ చేసే వారికి చేతినిండా పని ఉంటుంది. కళాకారులు సాధారణ రోజులకంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుంటారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు పూలు, పండ్లు, కొబ్బరికాయలు మరికొన్ని వ్యాపారాలు జోరుగా సాగుతాయి. ఇందువల్ల అనేక మందికి వినాయక చవితి పండుగ ఉపాధినిస్తుంది.

రాజస్థాన్ నుంచి కళాకారులు



వినాయక చవితి సమీపిస్తుండటంతో రాజస్థాన్ నుంచి ఆరు మంది కళాకారులను రప్పించాం. ఇప్పటికే కొన్ని విగ్రహాలను పూర్తిస్థాయిలో తయారు చేశాం. వినాయక చవితికి నెల రోజుల ముందే విగ్రహాలన్ని పూర్తిగా తయారు చేసేందుకు రాత్రింబవళ్ళు పనిచేస్తున్నాం.

- మోహన్, విగ్రహాల తయారీదారుడు

ఆగస్టు 8న 'హరివరాసనం' శతాబ్ది ఉత్సవాలు

లక్కిరెడ్డిపల్లె : రాచవీడు అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 8న తిరుపతిలోని మహంతి ఆడిటోరియంలో హరివరాసనం శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాచవీడు అయ్యప్పస్వామి సమితి వ్యవస్థాపకులు సుబ్రమణ్యం స్వామి తెలిపారు. అయ్యప్పస్వామి హరిహరాసనం పాటను 1923లో కొనకందు జానకి రచించారన్నారు. వంద సంవత్సరాలు పురస్కరించుకున్నందుకు గాను ఈ ఉత్సవాలను ఐదు రాష్ట్రాలలో ఉండే గురుస్వాములు, పీఠాధిపతులు, ట్రావెన్‌కోర్ బోర్డు మెంబర్ ఆనంద్ గోపాల్ శంభు నంబ్యంది, పండల రాజా ప్యాలెస్ ట్రస్టు అధ్యక్షుడు శశికుమార్ వర్మ, శబరిమలై సన్నిదాన తంత్రీలు, పూజారులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లక్కిరెడ్డిపల్లె అయ్యప్ప స్వామి సేవాసమితి సభ్యులు గంగరాజు, వెంకటేష్, గురుస్వామి రమణ, గురుస్వామి గంగయ్య, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, నాగేంద్ర, సుధీర్, గంగరాజు, పద్మేష్, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



గురుకులం విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జడ్జి లత

నందలూరు(రాజంపేట) : మానవ అక్రమ రవాణా నేరమని నందలూరు జడ్జి లత అన్నారు. ఆదివారం డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో(ఆడపూరు) మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలను కొనడం, అమ్మడం వారితో వ్యభిచారం చేయించడం నేరమన్నారు. మహిళలను బాలికలను ఏదో రకంగా మభ్యపెట్టి డబ్బులకు ఆశపెట్టి అమ్మడం నేరమే అవుతుందన్నారు. వ్యభిచార గృహం నుంచి బయటపడిన స్త్రీల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఆర్టికల్ 23(1) ప్రకారం మానవ అక్రమరవాణా, వెట్టిచాకిరి నిషేధించినట్లు తెలిపారు. అతిక్రమిస్తే శిక్షార్హులన్నారు. చదువుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అన్నారు. టెక్నాలజీని మంచి కోసం వినియోగించాలన్నారు. అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, న్యాయవాదులు హస్తవరం ఆనంద్‌కుమార్, నరసింహులు, వినయ్, షమీవుల్లాఖాన్, నాయనపల్లె అనుదీప్‌లు మాట్లాడుతూ ర్యాగింగ్, ఉచిత న్యాయం, బాలికల హక్కులు, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఎస్‌ఐ శంకర్‌నాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత, కోర్టు సిబ్బంది, గురుకులం సిబ్బంది, అధ్యాపకులు, పీఎల్‌వీలు పాల్గొన్నారు. అనంతరం గురుకులంలో జడ్జి లత కలియతిరిగారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. వంటశాలలను తనిఖీ చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.

రేపు వేంకటేశ్వర స్వామి వ్రతకల్పం

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి వ్రత కల్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

నేడు మండల సమావేశం

పుల్లంపేట : మండల సర్వసభ్య సమావేశం సోమవారం (నేడు) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరుగనుందని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ తెలియజేశారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మైనార్టీ నాయకుడు, కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్ చిన్నాన్న అయిన ఖలీల్ (72) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, మైనార్టీ నాయకులు ఖాన్ బాషా, జాకీర్, బాబ్‌జాన్, నబీ, సాహెబ్ తదితరులు ఉన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె: వేర్వేరు ప్రాంతాల్లో నాటుసారాను తరలిస్తున్న, విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి వారి నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని గంగాపురంపల్లె, నిమ్మనపల్లె గ్రామ సమీపంలోని ప్రాంతాల్లో నాటుసారా విక్రయస్థావరాలపై దాడిచేసి చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన చిన్న వెంకటరమణ, గంగాపురంపల్లెకు చెందిన చరణ్‌లు సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణం బైపాస్‌రోడ్డులో ఆదివారం రాత్రి జరిగింది. వాల్మీకిపురానికి చెందిన చరణ్(16), వినయ్(20)లు ద్విచక్రవాహనంలో డిమార్టులో సరుకులు కొనుగోలు చేసి వెళుతుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్, వినయ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలు, కార్యకర్తలకు అండగా ఉంటాం



ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, అసోసియేషన్ సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని పేదలు, పార్టీ కార్యకర్తలకు ఆపద సమయంలో అండగా ఉంటామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని పలు మండలాలలోని పార్టీ కార్యకర్తలు, పేదలు అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న వారిని స్వయంగా తిరుపతిలోని ఆసుపత్రులకు వెళ్లి పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆదుకుంటామని తెలియజేశారు. తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మోసాటి చెంగల్రాయుడు, సన్నీలను, అలాగే బలరామయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇరువూరి వీరభద్రను, అమర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ప్రసాద్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శివారెడ్డి, రాయుడు, నవీన్, ఆర్‌ఎంఓ కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఓబులవారిపల్లె : ఇటీవల మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యుత్ ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మన రెడ్డి అసోసియేషన్ కువైట్ అధ్యక్షుడు ఎస్.మహేశ్వర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటసుబ్బారెడ్డిలు రూ. 3 లక్షలు సహాయం అందించారు. గాయపడ్డ విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి శ్రీనివాసుల రెడ్డికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముమ్మడి బాలిరెడ్డి, మన్నూరు చంద్రశేఖర్ రెడ్డి, పి.చెంగల్ రెడ్డి, పంజం సుదర్శన్ రెడ్డిలు నగదును అందజేశారు. ఆర్థిక సహాయం అందించినందుకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, అసోసియేషన్ సభ్యులకు శ్రీనివాసుల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే కోడూరు మండల వైస్ ప్రెసిడెంట్ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మన రెడ్డి అసోసియేషన్ కువైట్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, బసిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, పులపుత్తూరు సురేష్ రెడ్డి, డి.సుమన్ రెడ్డి, వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసులు రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

సేవచేయడంలోనే నిజమైన సంతృప్తి



మాట్లాడుతున్న డీఎస్పీ వీఎన్‌కే చైతన్య

రాజంపేట టౌన్ : పేద ప్రజలకు సేవచేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం వాసవీక్లబ్ రాజంపేటశాఖ, తిరుపతి అరవింద్ ఐకేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా వాసవీక్లబ్ ప్రతినిధులు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయిస్తుండటం అభినందనీయమన్నారు. ఇతరుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఇలాంటి సేవాకార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పేద ప్రజలు ఆర్థిక స్తోమత లేని కారణంగా వివిధ రకాల జబ్బులపై నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. అందులో కంటిచూపుపై చాలా మంది అశ్రద్ధగా ఉంటారన్నారు. ఎవరు కూడా కళ్లపై అశ్రద్ధ చూపకుండా, కంటికి చూపు సమస్య ఉన్న విషయం గుర్తించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ముఖ్యంగా పేదలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎక్కడ జరిగినా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజానికి మేలు చేసే వారికి పోలీసుశాఖ తప్పక సహకరిస్తుందన్నారు. కాగా ఈ ఉచిత వైద్య శిబిరంలో 257 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 51 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించారు. దీంతో వాసవీక్లబ్ ప్రతినిధులు ఆపరేషన్లు అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో తిరుపతికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అరవింద్ ఐకేర్ హాస్పిటల్ వైద్యులు హేమ, అనిత, వాసవీ క్లబ్ ప్రతినిధులు సనిశెట్టి నవీన్‌కుమార్, గూనిపూటి యశ్వంత్, ఆదూరి లక్ష్మినారాయణ, నటకల రామకృష్ణ, జగన్, బవిరిశెట్టి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మారణకాండను ఆపి శాంతిని నెలకొల్పాలి



గాంధీ బస్టాండ్ వద్ద నిరసనలు వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు, ముస్లింలు

- మణిపూర్ ఘటనలపై క్రైస్తవులు, ముస్లింల శాంతియుత నిరసన

వాల్మీకిపురం: మూడు మాసాలుగా హింసాత్మక చర్యలతో మండుతున్న మణిపూర్‌లో మారణకాండను ఆపి శాంతిని నెలకొల్పాలని వాల్మీకిపురంలో ఆదివారం క్రైస్తవులు, ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్‌ఐ చర్చి నుంచి గాంధీ బస్టాండ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించి, ప్రార్థనలు చేశారు. సందర్భంగా మత గురువులు, ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ లోహాలు, ఖనిజాలు, వనరుల కోసం మానవత్వాన్ని మరిచి గిరిజన తెగకు చెందిన కుకీలపై ప్రభుత్వ పెద్దల అండదండలతో మైతేయిలు తెగవారు ఆటవిక, పాశవిక దాడులకు పాల్పడడం అమానుషమన్నారు. మహిళలను దిగంబరం చేసి తరిమికొట్టడం, అడ్డుపడిన వారిని హతమార్చడం, పోలీసుల ఎదుటే మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం వంటి దౌష్ట్యాలు, దురాగతాలకు పాల్పడడం అమానవీయమన్నారు. ఇలాంటి దారుణమైన సంఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు ప్రభుత్వ పెద్దలు, ప్రజా సంఘాలు స్పందించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు మౌనం వీడి శాంతి భద్రతలు, మహిళలు, పౌరుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులు మేరి, రాజేష్, జోసెఫ్, ఆర్‌బీకే చైర్మెన్ నీళ్లభాస్కర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ముస్లింలు అబ్దుల్ అజీమ్ సాహెబ్, జవాద్‌హుస్సేన్, రియాజ్ సాహెబ్, మహమ్మద్ అలీ సాహెబ్, అబ్దుల్ రహీం సాహెబ్, అమీర్ హుస్సేన్, కరీం సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, శ్యామ్, పునీత్, పీటర్, శివారుపల్లి సుధాకర్, ఉజాలా, సమీ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు సంఘీభావంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్‌రంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యాలు, ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ ఆరోపించారు. సంస్థలో 85వేల మంది ఉద్యోగుల సేవలు అవసరం కాగా యాజమాన్యం కేవలం 50వేల మందితోనే పనులు చేయిస్తోందన్నారు. దీంతో ఉద్యోగులపై పనిభారం పెరిగి ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోపు క్రిష్టప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌లు మాట్లాడుతూ ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీలోనైనా న్యాయం చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలంటూ డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణల అమలుపై వ్యతిరేకత రావడంతో దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లను ప్రవేశపెడుతున్నారంటూ విమర్శించారు. ఏడు వందలకు లభించే విద్యుత్ మీటర్ల స్థానంలో 7 నుంచి 8 వేలు ఖర్చుచేసి స్మార్టుమీటర్లు ఎందుకు తీసుకోవాలో ప్రతిఒక్కరూ ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలంటూ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, ఏపీ గ్రామ, వార్డు సచివాలయం హెల్త్‌సెక్రటరీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీంబాషా, నేతలు పుల్లయ్య, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌బీ నేత కాలేషా

రాయచోటి అర్బన్ : జిల్లా అధికారులు హాస్టల్ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషా డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో 4033 సంక్షేమ హాస్టళ్లు ఉండగా అందులో దాదాపు 5లక్షల మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారన్నారు. హాస్టళ్లలో కనీస వసతులు, సదుపాయాలు కూడా లేకపోతుండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో అధికారుల వైఫల్యం కారణంగా జైళ్ల కన్నా అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. రాష్ట్రంలో సగానికిపైగా హాస్టళ్లకు రెగ్యులర్ వార్డన్‌లు లేక ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా హాస్టళ్లకు స్వంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. సంవత్సరం నుంచి విద్యార్థులకు డైట్ బిల్లులను ప్రభుత్వం సక్రమంగా చెల్లించకపోతుండడంతో విద్యార్థులకు ఆహారం అందించడంలో కోత విధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు హాస్టల్ నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి తద్వారా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామంటూ ఆయన హెచ్చరించారు. సమావేశంలో సమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామాల్లో మొహర్రం వేడుకలు



ఓబులవారిపల్లె: పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న యువకులు, గ్రామస్తులు



పుల్లంపేట: ప్రార్థనలు నిర్వహిస్తున్న కొల్లం గంగిరెడ్డి, సర్పంచ్ సిద్దు



చిన్నమండెంలో కొబ్బరి దివిటీల మధ్య పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : నియోజకవర్గం వ్యాప్తంగా ముస్లింలు ఆదివారం ఘనంగా మొహర్రం వేడుకలను నిర్వహించారు. రెండు రోజులపాటు ఉపవాస దీక్షలు ఉంటు మసీదుల్లో ప్రార్థనలు చేశారు. అంతేకాకుండా మండలంలోని నూకనపల్లె, చెన్నరాజుపోడు, వైకోట గ్రామల్లో పీర్ల చావడిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మొక్కులను తీర్చుకొని అగ్నిగుండం ప్రవేశం జరిపారు. డప్పువాయిద్యాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు గ్రామంలో పీర్లను ఊరేగింపు నిర్వహించగా ప్రజలు పంజారం అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకనపల్లెలో పీర్లు జల్ది(ముగింపు ఉత్సవాలలో)కి వెళ్లే కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కులమతాలకతీతంగా మతసామరస్యానికి నిదర్శనంగా పండుగను జరుపుకున్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట): మొహర్రం వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. పీర్లకొట్టంలోని పీర్లను ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈయన వెంట ఏఎస్‌ఐ శంకర్‌నాయక్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, ఎంపీటీసీలు సుబాన్‌బాషా, సోమిశెట్టి సునీత, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరక్టరు మున్వర్‌బాషా, మైనార్టీ నాయకులు మొయినుద్దీన్, సల్మాన్‌ఖాన్, అన్వర్‌బాషా, ఖాదర్‌బాషా, వల్లీబాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల నాని, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, బలరాం తదితరులు పాల్గొన్నారు.

దళవాయిపల్లిలో..

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లెలో మొహర్రం చివరిరోజు వేడుకలు సర్పంచ్ బోదనపు సిద్దూ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. కుల, మతాలకతీతంగా హిందూ ముస్లిం సోదరులు కలిసికట్టుగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. వేడుకలో నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి హాజరై పీర్లను దర్శించుకొని చదివింపులు చేశారు. అనంతరం కొల్లం గంగిరెడ్డిని సర్పంచ్ సిద్దు సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొబ్బరిదివిటీల మధ్య పీర్ల ఊరేగింపు

చిన్నమండెం : మొహర్రం ఉత్సవాలలో భాగంగా పీర్లను కొబ్బరి దివిటీల మధ్య చిన్నమండెం పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మొహర్రం ఉత్సవాలు 10వ రోజున పీర్లను పూలతో సుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పీర్లను దర్శించుకుని చదివింపులు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయచోటి రూరల్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.